క్లుప్తంగా

హుండీ ధ్వంసం

కథలాపూర్: భూషణరావుపేట శివారు మర్రివ్వ దేవాలయంలోని హుండీని దొంగలు ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. దొంగలు దేవాలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేయగా.. తలుపు తెరచుకోకపోవడంతో వదిలేసిపోయారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు దేవాలయం చేరుకొని పరిశీలించారు. హుండీలోని డబ్బులు దొంగలు ఎత్తుకెళ్లలేదని సభ్యులు చెప్పారు.

టేకు చెట్ల నరికివేత



సారంగాపూర్: బట్టపల్లి, ధర్మపురి మండలం నేరెల్ల గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు టేకు చెట్లను నరికేశారు. బట్టపల్లి గ్రామానికి చెందిన అర్రై ప్రేమానందం, పాలగాని మల్లేశం సమాచారమివ్వడంతో ఫారెస్ట్ సెక్షన్ అధికారి, డిప్యూటీ రేంజర్ రవికుమార్ ఆధ్వర్యంలో బీట్ అధికారులు నరికేసిన చెట్లను పరిశీలించారు. నాలుగు చెట్లు నరికివేతకు గురయ్యాయని, నిందితులను పట్టుకొని కేసు నమోదు చేస్తామని సెక్షన్ అధికారి పేర్కొన్నారు.

రోడ్ల మరమ్మతుకు నిధులు

కథలాపూర్: మండలంలో గత నెలలో కురిసిన వర్షాలకు నష్టపోయిన రోడ్లకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.10లక్షలు ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు గురువారం తెలిపారు. భూషణరావుపేట-ఆత్మకూర్ రోడ్డుకు రూ.లక్ష, పోతారం-కలిగోట రోడ్డుకు రూ.79వేలు, చింతకుంటలో వ్యవసాయ రోడ్లకు రూ.1.20లక్షలు, సిరికొండ-కోనరావుపేట రోడ్డుకు రూ.90వేలు, కథలాపూర్-చింతకుంట రోడ్డుకు రూ.60వేలు, తక్కళ్లపెల్లి-గుమ్లాపూర్ రోడ్డుకు రూ.2.39లక్షలు, తుర్తి-రుద్రంగి రోడ్డుకు రూ.1.62లక్షలు, సిరికొండ-కొండ్రికర్ల రోడ్డుకు రూ.90వేలు మంజూరయ్యాయన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

ఇబ్రహీంపట్నం: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2025-26 సంవత్సరానికి గాను పనులను గుర్తించేందుకు ఈనెల 4 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈనెల 4న అమ్మక్కపేట, బర్దీపూర్, 14న డబ్బా, ఎర్దండి, 19న ఎర్రాపూర్, ఫకీర్‌కొండాపూర్, 23న ఇబ్రహీంపట్నం, గోధూర్, 29న కొమటికొండాపూర్, కేశాపూర్, వచ్చేనెల 4న తిమ్మాపూర్, కోజన్‌కొత్తూర్, 11న వర్షకొండ, మూలరాంపూర్, 15న తిమ్మాపూర్‌తండా, 18న వేములకుర్తి, 23న యామాపూర్ గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి



బండి సంజయ్‌కు సమస్యను వివరిస్తున్న తక్కళ్లపెల్లి గ్రామస్తులు

కథలాపూర్: తక్కళ్లపెల్లి గ్రామస్తులు కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను గురువారం కలిశారు. గ్రామంలోని భోగేశ్వరస్వామి దేవాలయం సమస్యలను కేంద్ర మంత్రికి వివరించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పురావస్తు శాఖ, ఎండోమెంట్ అధికారులకు సూచనలు చేసి సమస్యను పరిష్కరించాలని కోరగా.. సానుకూలంగా స్పందించారన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ జైపాల్ రెడ్డి, రంగు గంగారాం, మల్లారెడ్డి, శ్రీకాంత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: రెవెన్యూ, అటవీ భూములు కబ్జా చేసి చదును చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆత్మకూర్ గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బొమ్మెనకుంట, ఎల్లమ్మకుంట, పెద్దచెరువుకు సంబంధించిన భూములు కొందరు ఎకరాల కొద్దీ కబ్జా చేస్తున్నారని, మొరం పోస్తూ లెవలింగ్ చేయిస్తున్నారని పేర్కొన్నారు. వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

సారంగాపూర్: క్రీడలు స్నేహభావం, ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు బాటలు వేస్తాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామంలో సూద వినయ్, కందుకూరి ఉమేశ్ స్మారక క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ముప్పాల రాంచందర్‌రావు, పొల్సాని నవీన్‌రావు మసర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంటును గురువారం ప్రారంభించారు. హిందూ సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంటు ప్రారంభోత్సవానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



తెలంగాణ సంప్రదాయానికి ప్రతిబింబం



పెగడపల్లి: బతుకమ్మ పండుగంటే మహిళలకు ఎంతో ఇష్టం. తీరొక్క పూలు తెచ్చి బతుకమ్మను పేర్చడం ప్రత్యేకత. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబింబించేది బతుకమ్మ పండుగ. పూలతో చేసిన బతుకమ్మలతో ప్రకృతికి పట్టాభిషేకం చేస్తుంటాం. తీరొక్క పూలతో పేర్చి పూల శిఖరంపై గౌరమ్మగా పసుపు ముద్దను ఉంచి కొలుస్తుంటాం.

– భోగ భాగ్యలక్ష్మి, ప్రభుత్వ టీచర్, పెగడపల్లి

వారం నుంచే పూల సేకరణ



మల్యాల: చిన్నప్పటి నుంచి బతుకమ్మ పండుగ కోసం వారం ముందు నుంచే పూలను సేకరిస్తాం. తోటల్లో కనబడే బంతి పూలు మొదలుకొని గునుక, టేకు పూలు తీసుకొచ్చి కట్టలు కడుతూ బతుకమ్మ పేర్చుతాం. రాత్రి పది గంటల దాకా బతుకమ్మ పాటలు పాడుతూ ఆడుతాం.

– దయాల జమున, ఉపాధ్యాయురాలు, మల్యాల

ప్రకృతిని పూజించే పండుగ



మల్యాల: ప్రకృతిని ఆరాధించే తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతున్న పండుగ బతుకమ్మ పండుగ. ప్రకృతిలోని పూలతో పెనవేసుకున్న బంధం ఈ పండుగ. ప్రతి ఆడపిల్ల జీవితంలో పూల పండుగకు ఎంతో ప్రాముఖ్యముంది. చిన్నప్పటి నుంచి ఎక్కడ ఉన్నా.. బతుకమ్మ పండుగ ఆడకుండా ఉండలేదు.

– జోగినిపల్లి సుష్మ, ప్రధానోపాధ్యాయురాలు



రాయికల్‌లో అమ్మవారి శోభాయాత్ర



పెగడపల్లిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

కొలువుదీరిన అమ్మవారు

దుర్గాదేవి శరన్నవ రాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఘనంగా పూజలు అందుకోనున్న అమ్మవారి విగ్రహాలు మండపాల వద్ద కొలువుదీరాయి. మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కథలాపూర్: బొమ్మెనలో కొలువుదీరిన దుర్గామాత



మల్లాపూర్‌లోని వాసవీమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సారంగాపూర్ రామాలయంలో అమ్మవారు



మల్యాల: ముత్యంపేటలో..



కోరుట్లలో భవానీ దీక్ష స్వీకరించిన భక్తులు



కొడిమ్యాలలో..



ధర్మపురిలో దుర్గామాతను మండపానికి తీసుకెళ్తున్న భక్తులు



మల్యాల: అడ్డరోడ్డు వద్ద ఆర్టీసీ బస్టాప్ షెల్టర్ ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. వర్షం, ఎండకు ప్రయాణికులు దుకాణాల వద్ద తలదాచుకోవాల్సి వస్తోంది. ఇటీవల బస్టాండులో మండల పరిషత్ నిధులతో మరమ్మతు చేపట్టినా.. ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయకుండా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో బస్టాప్ షెల్టర్ పార్కింగ్ స్థలంగా మారింది.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
స్వాతి, మల్యాల ఎంపీడీవో, సెల్ నంబర్: 9281481655

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

సమస్యలు పరిష్కరించాలి



జగిత్యాలరూరల్: ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

జగిత్యాలరూరల్: జిల్లాలో బాయిల్డ్ రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గురువారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పారాబాయిల్డ్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌రావు, సభ్యులు మధురావు చెన్నకేశవ్, శ్రీనివాస్‌రావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

రాయికల్: మైతాపూర్ గ్రామానికి చెందిన సుమారు 200 మంది రైతులు కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలోని ఇండియన్ బ్యాంక్‌లో రుణాలు పొందారని, వీరికి రుణమాఫీ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి సీఎం దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ అయ్యేలా చూస్తామన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, రఘుపతిరెడ్డి, గంప ఆనందం, సుధాకర్ పాల్గొన్నారు.

సారంగాపూర్: నాగునూర్ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రం అందజేశారు. ఆహ్వాన కమిటీ సభ్యులతోపాటు గ్రామస్తులు ఈనెల 5న గ్రామంలో జరిగే కార్యక్రమంలో పాలుపంచుకోవాలని కోరారు.

బీర్‌పూర్ మండల కేంద్రంలో ఎస్ఆర్ఎస్పీ వంతెన కూలిపోగా.. గురువారం ఎమ్మెల్యే వంతెనను పరిశీలించారు. పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు.

అభివృద్ధికి రాజ్యసభ నిధులు



డబ్బాలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ఇబ్రహీంపట్నం: మాకు రావాల్సిన నియోజకవర్గ అభివృద్ధి నిధులు మంజూరు కాకున్నా.. రాజ్యసభ సభ్యుల నిధుల నుంచి నిధులు మంజూరు చేస్తున్నానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం డబ్బా గ్రామంలోని 3వ వార్డులో రాజ్యసభ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. గోధూర్ గ్రామంలో రూ.4లక్షలతో నిర్మించిన లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం వద్ద కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. మాజీ ఎంపీపీ జాజాల భీమేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్ రెడ్డి, నాయకులు జాజాల జగన్‌రావు, వెంకటస్వామి, కంటం రమేశ్, పుప్పాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: నియోజకవర్గంలో వర్షాలకు దెబ్బతిన్న రహదారులు, కల్వర్టుల మరమ్మతులకు కలెక్టర్ రూ.17.05లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ గురువారం తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలానికి రూ.2.40లక్షలు, మల్లాపూర్ మండలానికి రూ.6.64లక్షలు, మెట్‌పల్లి మండలానికి రూ.8.01లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు.

సూర్యప్రభ వాహనంపై స్వామివారు



కోరుట్ల: పట్టణంలోని అష్టలక్ష్మీ ఆలయంలో నవరాత్రోత్సవాల సందర్భంగా మొదటి రోజు శ్రీలక్ష్మీనారాయణ స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బూరుగు రామస్వామిగౌడ్, సుభద్ర దంపతులు, అర్చకులు శ్రీరామాచార్యులు, అభిరామాచార్యులు, శ్రీకాంతాచార్యులు, ఎలిశెట్టి భూంరెడ్డి, నంద్యాడపు శ్రీనివాస్, గంగాధర్, అంజయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు ఆహ్వానం



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న సభ్యులు

ధర్మపురి: పట్టణంలో నవదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రోత్సవాలకు రావాలని కోరుతూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. రేకుర్తి కంటి దవాఖానలో నిర్వహిస్తున్న ఉచిత కంటి ఆపరేషన్ కార్యక్రమానికి రావాలని ఆహ్వానం పలికారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి



జంబిగద్దె పరిసరాలు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: దసరా, నవరాత్రి పండగలను పురస్కరించుకొని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జంబిగద్దెను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ రేణుక, నవీన్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

జగిత్యాల: రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం డిగ్రీ కళాశాలకు కేటాయించే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందికరంగా మారిందని, తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేయాలని శాతావాహన యూనివర్సిటీ ప్రైవేటు డిగ్రీ కళాశాలల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, శ్రీపాద నరేశ్ అన్నారు.

9న సత్యాగ్రహ దీక్ష



సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

మెట్‌పల్లి: ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో మెట్‌పల్లిలో ఈనెల 9న సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు బీసీ సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. పట్టణంలో గురువారం జేఏసీ సమావేశం జరిగింది. నాయకులు నల్ల వెంకటేశ్వర్లు, పుప్పాల లింబాద్రి, బొడ్ల రమేశ్, తుల రాజేందర్, తోగిటి అంజయ్య, గురిజెల రాజిరెడ్డి, మోరెపు గంగాధర్, దోమకొండ రమేశ్, జెట్టి నరేందర్ తదితరులున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



మల్లాపూర్: 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జగదీశ్ తెలిపారు. గురువారం మొగిలిపేట, ముత్యంపేట గ్రామాల్లోని పంచాయతీ కార్యలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. మండలవ్యాప్తంగా 23 పంచాయతీల్లో ఈనెల 1 నుంచి 6 వరకు ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. 4న ఒబులాపూర్‌తండా, వాల్గొండతండా, 5న చిట్టాపూర్, 6న మల్లాపూర్, హుస్సేన్‌నగర్, సంగెం-శ్రీరాంపూర్, వేంపల్లి, వెంకట్రావ్‌పేట, కుస్తాపూర్, దాంరాజ్‌పల్లి, రేగుంట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు సమావేశం

కథలాపూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో కథలాపూర్, మేడిపెల్లి, భీమారం మండలాల అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం ఉంటుందని ఎంపీడీవో శంకర్ తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా వస్తున్నారన్నారు. అధికారులు నివేదికలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలిరావాలి

మెట్‌పల్లి: కోరుట్ల పట్టణంలోని వెటర్నరీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు.

వైకుంఠధామాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలి

సారంగాపూర్: ఆయా గ్రామాల్లోని వైకుంఠధామాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో గంగాధర్ పేర్కొన్నారు. గురువారం లచ్చక్కపేట గ్రామ వైకుంఠధామాన్ని పరిశీలించారు. వైకుంఠధామం వద్ద పిచ్చిమొక్కలు, ఇతర చెత్త పేరుకుపోయి ఉండడంతో.. ఉపాధిహామీ కూలీలతో పరిసరాలను శుభ్రం చేయించారు.

ఆర్థిక సాయం

ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ నిరుపేదకు ఆర్థిక సాయం అందజేశారు. ధర్మపురికి చెందిన నారవేణి మల్లికార్జున్ ఇటీవల పొలాస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మపురి యూత్ క్లబ్ పక్షాన రూ.36వేల ఆర్థిక సాయాన్ని సభ్యులు లక్ష్మణ్, గుడ్ల రవి చేతుల మీదుగా అందజేశారు.

ఎంబీబీఎస్‌లో సీటు



రేణుక

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన మ్యాదరి శ్రీనివాస్-వరలక్ష్మి కూతురు రేణుక ఇటీవల నీట్‌లో జాతీయస్థాయిలో 6,660 ర్యాంక్ సాధించింది. గురువారం కరీంనగర్‌లోని ప్రతిమ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందగా.. గ్రామస్తులు అభినందించారు.

మల్లాపూర్: ఎంబీబీఎస్ సీటు సాధించిన ఎర్ర ప్రజ్ఞను మండల కేంద్రంలో గురువారం పద్మశాలీ సంఘం సీనియర్ నాయకులు సిరిపురం రవీందర్, మండల అధ్యక్షుడు అయ్యోరి దశరథం సన్మానించారు. ప్రభుత్వ కోటాలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. మోర సతీశ్, సాంబారి శంకర్, గుజ్జెటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సఖీ కేంద్రానికి ప్రేమ పెళ్లి చేసుకున్న యువతి

జగిత్యాలక్రైం: ప్రేమ పెళ్లి చేసుకున్న జంటను మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు కౌన్సిలింగ్‌కు పిలిచి యువతిని సఖీ కేంద్రానికి తరలించారని భర్త, అతడి కుటుంబ సభ్యులు గురువారం జిల్లా ఎస్పీని కలిశారు. మెట్‌పల్లి దుబ్బవాడకు చెందిన మారుతి, కళానగర్‌కు చెందిన శివాని(19) గతనెల 29న మెట్‌పల్లి శివారులోని మల్లన్న దేవాలయంలో వివాహం చేసుకున్నారు. దుబ్బవాడలో ఉంటూ ప్రేమ వివాహం చేసుకున్నామని ఈనెల 1న సాయంత్రం మెట్‌పల్లి సీఐని ఆశ్రయించారు. సీఐ ఇద్దరు కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. యువతి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహంతో ఉండటంతో.. యువతిని జగిత్యాల సఖీ కేంద్రానికి తరలించారు. దీంతో మారుతి తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిశారు. ఎస్పీని వివరణ కోరగా.. భద్రతపరమైన ఇబ్బందులు తలెత్తొద్దని యువతిని సఖీ కేంద్రంలో ఉంచామన్నారు.



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

బతుకమ్మ సంబరాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని రామకృష్ణ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారులు పాల్గొని బతుకమ్మ ఆటలాడారు. చిన్నారులను చైర్మన్ రామకృష్ణ అభినందించారు. ప్రిన్సిపాల్ రాజేందర్, రమేశ్, మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, శ్రీచైతన్య, నవోదయ కళాశాలల ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ తదితరులు హాజరయ్యారు.

డిజిటల్ కార్డుల సర్వే ప్రారంభం

కోరుట్లరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ ఒకే కార్డు రూపంలో అందించాలన్న లక్ష్యంలో భాగంగా డిజిటల్ కార్డుల సర్వే పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమం గురువారం సర్వరాజ్‌పల్లె గ్రామంలో మొదలైంది. తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణ ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు.